ఎమ్బీయస్ క్రైమ్ రచనలు - 02

## పబ్లిసిటీ ఫ్రాడ్

తమ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా వున్నారని నమ్మడం ఏలికలకిష్టం. "తమ ఏలుబడిలో నెలకు మూడు వానలు పడుతున్నాయి మహాప్రభో, ప్రజలందరి వద్దా కోడిగుడ్డంత బంగారం ఉంటోంది కూడా" అని వారిని ఉబ్బేసి వాళ్ల పబ్బం గడుపుకోవడం వందిమాగధుల కలవాటు. మంత్రిగారు మన వీధికొస్తున్నారంటే దారి పొడుగునా డిడిటి చల్లుతారు అధికారులు. అది చూసి మంత్రిగారు సంతోషించి ఏడాదంతా మనం ఆరోగ్యంతో వెల్లివిరుస్తున్నామని తమను తాము నమ్మించుకుని వెళ్లిపోవాలని వాళ్ల ఊహ. ప్రజాస్వామ్యంలోనే యిలా వుంటే, రాజుల కాలంలో ఎలా వుండేదో ఊహించుకోండి. అందునా రష్యా చక్రవర్తినిని!

చిన్నప్పుడు రాముడు చంద్రుడు కావాలని మారాం చేస్తే అద్దంలో చంద్రుణ్ని చూపించి యిదే అసలు చంద్రుడని ఏమార్చారట. ఒకవేళ మీ ప్రేయసి తనకూ ఓ తాజ్‌మహల్ కావాలని పేచీ పెడితే మీరు ఎక్కడ తేగలరు, మీరు షాజహాన్ చక్రవర్తి కాదుగా ! అందుకని తాజ్‌మహల్ ముందుభాగాన్ని అట్టముక్కలతో కట్టి చూపించేసి ఆమెను ఖుష్ చేసేశారనుకోండి. భలేగా వుండదూ? లేదా కంప్యూటర్ యుగం వచ్చేసింది కాబట్టి ఓ వర్చ్యువల్ తాజమహల్‌ను ఆమె ముందు నిలబెట్టి అబ్బురపరిచేరనుకోండి. ఇవన్నీ జోక్స్‌లా అనిపిస్తున్నాయి కదూ. ఈ జోక్‌ను నిజం చేసిన ఘనత ఓ ప్రియుడిది. అతని ప్రేయసి మరెవరో కాదు- కేథరిన్ ద గ్రేట్ (1729-96)!

కేథరిన్ అమాయకురాలేం కాదు, చాలా తెలివైనది. కుట్ర చేసి భర్తను రాజ్యభ్రష్టుణ్ని చేసి, తన 33 వ యేట సింహాసనం ఎక్కింది. చచ్చిపోయేదాకా రష్యాను పాలించింది. పోలండ్, క్రిమియా, టర్కీ, అలాస్కాల నోడించి తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ పోయింది. సూర్యోదయంతో నిద్ర లేచి రోజుకు 15 గంటల పాటు పనిచేసేది. మద్యానికి దూరంగా వుండేది. శత్రువులను అదలెత్తించింది. మరి ఫ్రాడ్ చేసి ఆమెను మెప్పించిన ప్రియుడు ఆమె కంటె పదేళ్లు చిన్నవాడైన గ్రిగరీ పోటెమ్‌కిన్. ఇతనే మన కథానాయకుడు. అతను పుట్టినది పెద్దగా ఆస్తులు లేని భూస్వాముల కుటుంబంలో. 1762లో కేథరిన్ చేసిన కుట్రలో ఆమెకు సహకరించి ఆమెకు చేరువయ్యాడు. రష్యా-టర్కీ యుద్ధం (1768-74)లో మిలటరీ కమాండర్‌గా వున్నాడు. అమోఘమైన తెలివితేటలున్నవాడు. అలవాట్ల రీత్యా కేథరిన్‌కు పూర్తిగా విరుద్ధమైనవాడు. బద్ధకస్తుడు. తాగుబోతు. జూదరి. వ్యభిచారి.



'ఆకాశం దించాలా? నెలవంక తుంచాలా..?'
కేథరిన్ ద గ్రేట్, తన ప్రియుడు గ్రిగరీతో..

వీరిద్దరి ప్రేమలో ఒక వింతైన కోణం ఏమిటంటే యితనికి కేథరిన్ అంటే ఎంత పిచ్చి అంటే వాళ్లిద్దరి మధ్యా శారీరక సంబంధం అరుదైపోయిన తర్వాత కూడా స్నేహితుడిగా కొనసాగుతూ ఆమె ప్రియులను కూడా యితనే ఎంపిక చేసేవాడు. ఆమెకు మగవాళ్ల పిచ్చి. చాలామంది ప్రియులుండేవారు. వారికి ఆమె యిచ్చిన బహుమతుల వలన 14 మిలియన్ల రూబుళ్ల ప్రజాధనం ఖర్చయింది. గ్రిగరీకి యిచ్చినది జస్ట్ 50 మిలియన్ల రూబుళ్లనుకోండి. అంతేకాదు, కేథరిన్ అతనికి 'ప్రిన్స్ ఆఫ్ హోలీ రోమన్ ఎంపైర్' అనీ, 'ప్రిన్స్ ఆఫ్ ద రష్యన్ ఎంపైర్' అనీ బిరుదులు యిచ్చింది. ఆమెకి అతనంటే మహా ముద్దు. అతని సన్నిధిలో ఆమె మామూలు ఆడదానిలా గారాలు పోయేది. అతని తెలివితేటలంటే మహా గురి ఆమెకు. నిజానికి గ్రిగరీకి నగరాలను తీర్చిదిద్దడంలో, గొప్ప భవనాలను కట్టించడంలో మంచి అనుభవం వుంది. ఇదిలా వుండగా, ఆమె ఆదేశాలపై 1783లో క్రిమియాను శాంతియుతంగా జయించిపెట్టినందుకు అతన్ని ఆ దేశపు గవర్నర్‌గా నియమించి ఆ ఎడారిని ఒక సుభిక్షమైన, నాగరికమైన దేశంగా తీర్చిదిద్దే బాధ్యత అతని భుజస్కంధాలపై పెట్టింది.

ఈ కొత్త ఉద్యోగం చేపట్టడం వలన కేథరిన్‌కు శారీరకంగా దూరమైనా సరేనంటూ అతనీ గవర్నరు బాధ్యతను తలకెత్తుకున్నాడు. మానసికంగా చేరువగానే వుండడానికి చరిత్రలో ఆమె పేరు శాశ్వతంగా నిలిచిపోయేట్టు మూడేళ్లలో క్రిమియాను ఓ గొప్పదేశంగా మలచుతానన్నాడు. అతని ప్రణాళికలు వింటే కళ్లు తిరుగుతాయి. సెవస్తాపోల్‌లో హార్బర్, యుద్ధనౌకలు, వ్యాపారనౌకలు, చైనా నుంచి పట్టుపురుగుల దిగుమతి, అడవుల పెంపకం, ద్రాక్షతోటల పెంపకం, కొత్త ఫ్యాక్టరీలు, రోడ్లు.. ఇవీ అవీ ఏమిటి, అసలు డ్నైపర్ నదికి 'కేథరిన్ యశస్సు' అని పేరు పెట్టేస్తానన్నాడు.

గవర్నరుగా వెళ్లాక తరచు రాజధానికి వచ్చి తను చేసిన పనుల గురించి నివేదికలు యిచ్చేవాడు. "నేను ప్లాన్లు వేయడమే కాదు, మూడేళ్ల నా పాలనలో అవి అమలు చేసి చూపించాను. ఇప్పుడు అక్కడ పొలాల్లో వ్యవసాయం సాగుతోంది. ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. ఏ పల్లె చూసినా సుఖంగా జీవిస్తున్న రైతులు కనబడతారు. బంజరు భూముల్లో బంగారం పండిస్తున్నారంటే అది నేను సాధించిన విజయమే. మిమ్మల్ని మెప్పించడానికే యిదంతా చేశాను. మీరే స్వయంగా వచ్చి నిజానిజాలు తెలుసుకోండి." అని ఉబ్బేశాడు గ్రిగరీ.

నిజానికి అతను చేసి చచ్చినది ఏమీ లేదు. అంతా పబ్లిసిటీ హంబగ్ !

కేథరిన్‌కు అప్పుడు 58 ఏళ్లు. అయినా ఉత్సాహం అణువంత తగ్గలేదు. తన ప్రియుడు తన కోసం, తన పేరు నిలపడం కోసం సృష్టించిన భూతలస్వర్గాన్ని చూడాలని ఉవ్విళ్లూరింది. 40 వేల మంది పరిజనాన్ని తీసుకుని బయలుదేరింది. ఏర్పాట్లు చూడాలంటూ గ్రిగరీ ముందే క్రిమియా వెళ్లిపోయాడు. అతను చేయాల్సిన ఏర్పాటల్లా మాయాబజార్ సృష్టించడం. ఎందుకంటే అతను చెప్పిన కర్మాగారాలు, పొలాలూ అన్నీ కాగితాల మీదే ఉన్నాయి కానీ కేథరిన్‌ను మెప్పించాలంటే ఒక సజీవనాటకం ఆడాలి. తప్పదు ! కానీ ఆ నాటకం వలననే అతను చరిత్రలో మిగిలిపోయాడు. ప్రపంచంలో ఈ స్థాయిలో 'స్టేజ్ మేనేజ్‌మెంట్' చేసిన ఘట్టం మరొకటి కానరాదు.

రోడ్డుకు యిరుపక్కలా యిళ్లున్న గ్రామస్థులనందరినీ యింటికి రంగులేయించుకోమన్నాడు. వాళ్లు ముందు గోడలకి మాత్రమే రంగులేశారనుకోండి. కంటికి నదురుగా అగుపించని దృశ్యాలను మరుగుపరచడానికి కృత్రిమంగా చెట్లు నాటించాడు. ఇంటి కప్పులు బాగా లేకపోతే కప్పించాడు – పెంకులతో కాదు, పెంకుల బొమ్మలేసిన అట్టముక్కలతో !

కీవ్‌లో రాణీగారితో వచ్చిన అతిథులందరికీ ఫర్నిచర్ అమర్చిన యిళ్లు యిచ్చారు. పనివాళ్లు, వాహనాలు సరేసరి. ఒక్కో భోజనం అయ్యాక టేబుల్ క్లాత్‌లు, రుమాళ్లు, కర్టెన్లు వంటివి బీదసాదలకు పంచిపెట్టేవారు. రాత్రి 10 గంటలకు రాణిగారు శయనాగారంలోకి వెళ్లిపోయేవారు. ఆమె మంచం పక్కనే ఒక అద్దాల గోడ వుండేది. అందరూ వెళ్లిపోయాక ఆ గోడను జరిపితే అక్కడ యింకో మంచం వుండేది. దానిపై ఆమె అప్పటి ప్రియుడు రెడీగా వుండేవాడు! గ్రిగరీ చేసిన యీ ఏర్పాటు చూసి రాణీ మురిసిపోయిందంటే మురిసిపోదా!?

ఇక బయటకు బయలుదేరితే రాణీగారి స్లెడ్జిబండికి పదహారు గుర్రాలు పూన్చారు. ఆమె కూచున్న కాబిన్‌లో ప్రతిగోడకీ మూడేసి కిటికీలు, ఆమె కాలు కింద పెట్టకుండా కంటికి కనబడినంత మేరా చూడడానికి వీలుగా, ప్రతి మజిలీలోనూ 560 గుఱ్ఱాలుండేవి – పాత గుఱ్ఱాలు అలిసిపోతే మార్చడానికి ! రాత్రి పూట ఆమె ప్రయాణిస్తూంటే రోడ్డు పక్కన పెద్దపెద్ద మంటలు వేసి వెలుగు వచ్చేట్టు చేశారు.

రాణీగారి కంట ముసలీ, ముతకా కనబడకుండా లోపల దాక్కోవాలని ఆర్డర్లు జారీ అయ్యాయి. ముష్టెత్తడాలు, అదీ, యిదీ కావాలని అర్జీలు పెట్టుకోవడాలు పనికి రావు ! అందరూ మంచి బట్టలు కట్టుకుని వచ్చి తమ ఏలుబడిలో సుఖంగా వున్నామని రాణీతో చెప్పాల్సిందే ! వాళ్లు అలాగే చెప్పారు. కేథరిన్ ఎంతో సంతోషించింది. తనతో వచ్చిన ఫ్రాన్స్ రాయబారితో "చూశావా, నా దేశంలో ప్రజలెంత సంతోషంగా వున్నారో!" అని చెప్పుకుని మురిసిపోయింది.

డ్నైపర్ నది మంచు కరిగేక, రాణీగారు, మూడువేల మంది పరివారమూ పడవల్లో ముందుకు సాగారు. గ్రిగరీ బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశాడు. ఏడు నౌకలను రాజప్రాసాదాలుగా అలంకరించాడు. వెంట 80 నౌకలు వచ్చాయి. ఓడలలో గోడలే కాదు, సర్వెంట్ యూనిఫారాలలో బొత్తాలు కూడా బంగారంతో చేసినవే. బంగారు పళ్లెరాలలోనే భోజనాలు ! ఆమె నౌక అలా నదిలో వెళుతూండగానే కాబిన్‌లోంచి ఒడ్డున వున్న పట్టణాలను చూస్తూండేది. పట్టుపరుపులపై పవళించి ఆమె బయటకు చూస్తే చాలు, స్వాగత తోరణాలు, విజయస్తంభాలు కనబడేవి. ఆకుపచ్చని గడ్డి, దాంట్లో మేస్తున్న పుష్టిగా కనబడే పశువులు, పచ్చని పొలాలు... పొద్దు కుంకితే చాలు, గ్రామవాసులు ఆటపాటలతో గంతులు వేస్తూ కనబడేవారు. ప్రజలింత సంతోషంగా వుండడం చూసి రాణీగారికి వెర్రెక్కిపోయింది. గ్రిగరీని పదేపదే పొగిడింది. దాంతో అతని ప్రత్యర్థులుకూడా ఆమె ఎదుట ఏం చెప్పడానికీ సాహసించలేకపోయారు.

నిజానికి యిదంతా గ్రిగరీ మాయాబజార్ టెక్నిక్. ఆ భవనాలకు కప్పులే లేవు. కిటికీలూ, గుమ్మాలూ ముందే లేవు. ఆ కనబడే యిళ్ల వెనుక రోడ్లే లేవు. ఆ పశువులను ఎక్కడి నుంచో తోలుకుని వచ్చారు, రాణీగారి కళ్లెదుట మేయడానికి. రాత్రులు ఆ గంతులేసినవాళ్లు రైతులు కారు, బానిసలు ! వాళ్లని తన్ని, బెదిరించి ఆనందంతో డాన్సు చేస్తున్నట్టు నటింపించారు. చీకటి పడగానే వాళ్లని పశువుల్లా బండి ఎక్కించి తదుపరి మజిలీకి తీసుకుపోయేవారు – అక్కడ డాన్సు చేస్తూ కనబడడానికి. రాణీగారికి వీళ్ల మొహాలు గుర్తా, పాడా?

నౌకలను మూడు ప్రదేశాల్లో లంగరు వేశారు. అక్కడ యీనాటి సినిమా సెట్టింగులను తలదన్నేలా కృత్రిమ జలపాతాలు, అరణ్యాలు సృజించారు. ఎకా టెరినొస్లావ్‌లో రాణీ ఒక చర్చికి శంకుస్థాపన చేసింది. గ్రిగరీ ప్లాన్ ప్రకారం చూస్తే అది రోమ్‌లోని సెయింట్ పీటర్ చర్చిని తలదన్నాలి. దాని నిర్మాణం అసలు జరగనేలేదనుకోండి, అది వేరే విషయం. రాణీగారికి తెలియదుగా ! ఆవిడ అక్కణ్నుంచి గుఱ్ఱాల బగ్గీ ఎక్కి పర్యటన కొనసాగించింది. రోడ్డు పక్కన ఎక్కడ చూసినా ఏదో ఒక పరిశ్రమే ! ఇటుకల బట్టీలు, రోడ్డు వేయడాలు, అన్నీ జరిగిపోతున్నాయి. గ్రిగరీ 20 జాతుల మనుష్యులను వేరే వూళ్లనుంచి లాక్కొచ్చి ఆ రెండు రోజులూ వాళ్ల చేత అక్కడ పని చేయించాడు. ఇక రాణీగారి ఉల్లాసానికి ప్రతిరోజూ కొత్తకొత్త వినోదాలు కల్పించారు. ఒకరోజు భోజనాల వేళ 180 మంది వాద్యబృందం సంగీతకార్యక్రమం నిర్వహించారు. మరొకరోజు ఒక కృత్రిమ అగ్నిపర్వతాన్ని సృష్టించారు. అది రాత్రంతా లావా చిమ్ముతూనే వుంది. మరో రోజు ఒక ఉత్తుత్తి యుద్ధం జరిగింది.

ఈ తమాషా జరపడానికి 70 లక్షల రూబుళ్లు ఖర్చయ్యాయి. ఇవి 18 శతాబ్దపు అంకెలు. ఇప్పటి ప్రకారం అంకెలు వేస్తే గుండెలవిసిపోతాయ్ ! ఇదంతా ఎందుకురా అంటే తన ప్రేయసిని సంతోషపెట్టడానికి గ్రిగరీ పెట్టిన ఖర్చు, పడిన శ్రమ. తన ప్రియుడు తనకోసం నిర్మించిన మిథ్యాప్రపంచం చూసి కేథరిన్ మురిసిపోయింది. పాపం, అదంతా నాటకమని తెలిస్తే ఎంత బాధపడేదో ! నిజానికి గ్రిగరీ చూపించిన యుద్ధనౌకలు ఎందుకూ పనికిమాలిన సరుకుతో కట్టినవి. ఫిరంగులలో గుళ్లే లేవు. ఇక ఖేర్సన్ కోట పైకి గట్టిగా కనబడుతోంది కానీ యిసుకతో కట్టించారు. ఫిరంగి గుండు కాదు కదా, ఓ పిడుగు పడినా కోట రెండు నిమిషాల్లో కుప్ప కూలి వుండేది. ఇవన్నీ రాణీ దృష్టికి వచ్చి వుంటే ఆవిడ ఉత్సాహం చచ్చిపోయి వుండేది. కానీ అంతటి మేధావి కూడా గమనించ లేని

విధంగా తీర్చిదిద్దాడు మన గ్రిగరీ. దీని వలన అతనంటే ఆమె మరింత ముచ్చటపడింది. అందుకే యిది ఒక గొప్ప పబ్లిసిటీ ఫ్రాడ్‌గా చరిత్ర కెక్కింది.

1960లలో ఆంధ్రపత్రిక డైలీలో "గిరీశం" కార్టూన్ స్ట్రిప్ నడిపేటప్పుడు బాపుగారు ఒక కార్టూన్ వేశారు. ఒక రాజమహల్ బొమ్మ గుడ్డ మీద వేయించి యిద్దరు తీసుకెళ్లి ఒక గుడిసె ముందు పెట్టేస్తూంటారు. అది చూసి గిరీశం అడిగితే "మంత్రిగారు యిటేపు వస్తున్నారు. ఈ దారిద్ర్యం వారి కంటపడకూడదని.." అని జవాబిస్తారు వాళ్లు. అది మంచి జోక్ అనుకుని నవ్వుకున్నవాళ్లు యీ గ్రిగరీ–కేథరిన్ కథ చదివేక నాలిక కరుచుకోవలసి వస్తుంది కాబోలు !

**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

●●●